"ఇదిగోనండీ! ఉన్నదికానీ చాలా పాతది." అన్నాను లోపలవిచారంగావున్నా పైకి కనపరచకుండా.

"పోనీలెండి. ఏదయితేనేం పనిచేస్తేచాలు రక్షించారు. వెళ్ళొస్తానండి. ఎల్లుండి వచ్చేటప్పుడు మీ గొడుగుమాట మరచిపోనులెండి!" అని ఆయన గొడుగు విప్పి గుమ్మం దాటాడు. అప్పుడు నాగొడుగు మీకూనాకూ కడసారిచూపులివేనేమో అన్నట్టు చూసింది.

* * *

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి. నెలలు గడిచాయి. కాని నా గొడుగు అంతు లేదు. వెధవది అంత ఘరానామనిషికికూడా నా గొడుగే కావలసి వచ్చిందేమో? ఏమనుకుంటే ఏంలాభం! నాకూ దానికీ ఋణం తీరిపోయింది. పోనీ వాళ్ళవూరువెళ్లి తెచ్చుకుందామా అంటే, రానూపోను చార్జీలు ఆ గొడుగు విలువకు రెండురెట్లు అవుతవి. ఇక దాన్ని మరచిపోవలసిందే. చచ్చినట్లు కొత్తది కొనాలి.

కొత్త గొడుగు కొనడానికి బజారుకు వెళుతుంటే లక్ష్మి ఎదురుగావచ్చి, "ఏమండీ అంత కష్టపడి అతుకులేసి, బాగుచేసిన గొడుగు ఆయనకు అప్పచెప్పేరుకదా? అంత కష్టపడకపోతే ముందే కొనుక్కుంటే యేంపోయేది?" అంది నవ్వుతూ.

లక్ష్మి తెలివితక్కువకు నవ్వొచ్చింది. "ఆ! అప్పుడేగనుక క్రొత్తదే కొన్నట్లయితే పాతదానికి బదులు కొత్తదానికే ఎసరు పెట్టేవాడు ఆ పెద్దమనిషి" అంటూ, నవ్వుతూ బజారుకెళ్ళాను కొత్త గొడుగుకోసం.

కథానిక

# "ఋణస్య—"

అంగర వెంకటసత్యనారాయణరావు

ప్రతిదినం ఉదయం సాయింత్రం ఆ మార్గాన వచ్చేపోయేవారికి ఒక చెప్పలేని ఆకర్షణ కలిగిస్తూండేది ఆ కుటీరం. "మోరెమకుట పీతాంబరశోభి-గోవర్ధన గిరిధారి" అని, "నాథహరే జగన్నాథహరే" అని, "బాలగోపాల కృష్ణా పరమకళ్యాణ గుణాకరా" అని రోజూ ఒక తరంగం, ఒక అభంగం, ఒకగీతగోవిందం మృదుమధురంగా వినిపిస్తుండేవి. ఆడంబరంలేక భక్తిరస ప్రపూర్ణమై, శ్రవఃపేయమైన ఆ మధురగానమే దారిపోయే ప్రతి హృదయాన్ని ఆకర్షించేది.

గడపలో కాలుపెట్టేసరికి ముందు ఒక విశాలమైన చావిడి, చావిడికి మధ్యగా ఒక చిన్నగది ఉండేది. అది పరమపునీతమైన పూజామందిరం.

మధురగీతాలాపనం గావిస్తూన్నది దశవర్ష ప్రాయంగల ఒకబంగారు బొమ్మవంటి అమ్మాయి. పండు తమలపాకులావున్న తాత యెదురుగా కూర్చొని ధ్యానతత్పరతలో అచేతనంగా తాళం వేస్తూండేవాడు. లౌకిక విషయాలతో ఆ పూజామందిరానికి ఏమీ ప్రసక్తిలేదు.

ఒక దశకు పూర్వంనుంచి ఆ పూజామందిరానికి అక్కడ ఉనికి ఉన్నట్టు, అందులోనే తాత నివశిస్తూన్నట్టు ఆ ప్రాంతంలో వినికిడి. భౌతిక విషయాలపై కారణాంతరాలచేత విరక్తిచెంది, కేవలం పారలౌకిక చింతానురక్తుడైన తాత పది సంవత్సరాలకు పూర్వం ఒకనాడు అరుణోదయ సమయాన దేవతార్చన నిమిత్తం పుష్పాలు తీసుకొని వస్తూంటేగా ఒక చోట మాణిక్యంవంటి రెండేళ్ళబిడ్డ గోచరించింది. ఆ బాలికనుచూసేసరికి విస్మృతిపథాన ఏదో తగినలిట్టు తాతకి గుండె జల్లుమన్నది. అవ్యక్తంగా ఆ పిల్లనెత్తుకొన్నాడు ఆనాటి కణ్వమహామునిలా. కాని కొద్ది సంవత్సరాలకు పూర్వమే ప్రాపంచిక విషయాలపై పూర్తిగావిరక్తిచెంది సర్వసంగ పరిత్యాగివలెవున్న తనకి ఏ ఋణానుబంధం ఇంకా తెగకుండా నిలిచి ఉందా అని తాత తనలో తను ఒక్కసారి ఏదో చెప్పలేని బాధపడ్డాడు. దిక్కుమాలిన ఆపిల్లతనకు గోచరించిన ఉత్తరక్షణంలోనే తను ఎత్తుకున్నా, ఆ లిప్తపాటుకాలంలోనే ఒక జీవితకాలంలో

మానవుడు అనుభవించే బాధపడ్డాడు తాత. కాని తన శరీరంలో ప్రవహించేది జాలికి కరిగిపోయే రక్తం! ఈశ్వరుడు తన శరీరంలో కరుణాపూరితమైన మార్దవహృదయాన్ని ప్రతిష్ఠించేడు! ముక్కుముఖం ఎరుగని ఆ పసిపిల్లని పరమేశ్వర ప్రసాదంగా గ్రహించి, తన పూజామందిరానికి తెచ్చి, ఏ పూర్వజన్మానుబంధం తెగక నిల్చివుందో, ఏ ఋణాస్య తనను బాధ పెట్టిందో కాని పెంచడం ప్రారంభించేడు.

జీవితప్రపంచంలో తాతకి అన్నివిధాలా ఆశలంతరించిపోయేయి. మహామ్మారిలాంటి అంటువ్యాధికి, నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉన్న కుటుంబం యావత్తూ అతి స్వల్పకాలంలో ఆహుతి అయిపోయేరు. తాత నిజంగా వెర్రివాడైపోయేడు పాపం! తన ఆస్తి సర్వస్వం దానధర్మాల పరంచేసి బంధన విముక్తుడైనట్టుగా భావించుకొని ఒకనాడు ఆ ప్రదేశంలోని ఆ పూజామందిరం వాసస్థానం గావించుకున్నాడు. జీవిత పరిశేషం పారమార్థిక చింతలో గడపడమే అతని ఆశయం. ఆ నిశ్చయంతోనే కాలం గడిపేడే కొన్నివత్సరాలు. కాని ప్రశాంతంగా నడుస్తూన్న తన జీవితాన్ని విధి మహాప్రళయం వలె ఎదుర్కొని అతలాకుతలం గావిస్తుందని తాత పాపం స్వప్నంలోనైనా తలచలేదు. కాలం అలాగడిచింది కొన్నాళ్లు.

“గౌరీ!” అని పిలుస్తూండేవాడు తాత ఆ పిల్లని. గౌరినిచూస్తే తాతకి ఏదో చెప్పలేని అభిమానం. గౌరికి విద్యాభ్యాసం గావించేడు. ఒక్కక్షణం గౌరి కనిపించకపోతే ఎంతో ఆందోళనపడేవాడు తాత. గౌరి అంటే తాతకి ప్రాణప్రదం—ఎందుకో! తాతకీ తెలియదు. రక్తం పంచుకొని జన్మించిన తన ఆత్మీయులు అందరూ రెప్పపాటు కాలంలో నిర్మూలం అయిపోగా, రెక్కలు తెగిపోయిన పక్షిలా అయి, జీవితంమీద ఆశ అన్నది విడిచిపెట్టుకొని, సర్వస్వం పరిత్యజించిన తాతకి ఎందుకు మళ్ళీ తలవని తలంపుగా ఈ అనుబంధం ప్రాప్తించిందో అతనికే తెలిసింది కాదు. రానురాను ఆ విషయంగురించి తాత అట్టే తలపోసేవాడు కాడు. ఎందుచేతనంటే బాధపెట్టిన భాగ్యభాగాలను విసర్జించిన తన స్మృతిపథంలోకి మళ్ళీ ఆ తలపులు రాకుండా ఒక నిశ్చలానందపథంలోకి ఈడ్చుకుపోయేది గౌరితో కాలక్షేపం. నోరెరుగని లేబ్రాయపు గౌరిచేష్టలకు తాత పరమానంద భరితుడయేవాడు. ఇటు భగవత్ప్రార్థన, అటు గౌరి చిన్నారి చేష్టలకు ఒకఆనందానుభూతి యివే తాతకి దైనికజీవిత వ్యాపకాలు.

గౌరి ఎంతో తెలివితేటలు, చురుకుదనంగల పిల్ల. అందుచేతనే తాత శిక్షణలో వన్నెలుదేరిన మాణిక్యంలా రాణించింది. విద్యాభ్యాసంలో గౌరి తాతవద్ద ఎన్నో పాటలు, భక్తి గీతాలు నేర్చుకుంది. నిత్యం తాత పూజ ముగియగానే గౌరి తనకుని సర్గంగా అలవడిన మృదుమధుర గాత్రం ఎత్తి, భక్తిగీతా లాలపించి, భగవత్ప్రార్థన గావిస్తూంటే ఆ మధురగాన ప్రభావంలో శిలాకృతి వహించిఉన్న పరమేశ్వరుడు చైతన్యం వహించి, నృత్యంచేసేవాడు భక్తుల హృదయ మందిరాలలో. తాత భక్తిపారవశ్యం చెంది పోయేవాడు. ప్రార్థన ముగియగానే గౌరిని దగ్గరగా తీసుకొని “ఎంత బాగా పాడేవు నా చిట్టి తల్లీ!” అని అంటూ తనలో మాత్రం ఏదో అనిర్వచనీయమైన బాధ పడేవాడు.

గౌరి పూజానుమాల కోసం పోయి రావడం కొంచెం ఆలస్యం అయితే తను కూడా పోయి గౌరిని తోడ తీసుకొని వచ్చే వరకూ తాతకి మనస్థిమితం ఉండేదికాదు. ఎప్పుడైనా ఒక మాసు గౌరికి కాస్త కాకచేస్తే—కన్న సంతానం కోసం లోకంలో ఏ తల్లీ అంత ఆందోళన పడదు!—తాతమాత్రం చెప్పలేని ఆత్రుత పడిపోయేవాడు ఆ బాధ నివారణ అమేవరకు. తల్లి, తండ్రి, గురువు, దైవంగా గౌరిని పెంచి కరుణా తరంగితమైన తాత హృదయం గౌరి ఆ పాటలకు మాతృహృదయం అనుభవించలేని ఒక మధురానుభూతిని చెందేది. కాని తాతవినా ప్రపంచంతో సంబంధంలేని గౌరి తనను “తాతా”! అని పిలిచినప్పుడల్లా తాతహృదయం ఒక తియ్యని బాధతో పెల్లుబుకి పోయేది.

తాత దయామంజరంలో పెరిగి గౌరి నానాటికి పెద్దదైంది. వృద్ధాప్యంలో తాతకి గౌరి తలవని తలంపుగా తోడునీడ అయింది. ఈడుకి పది సంవత్సరాల బాలిక అయినా గౌరి తాతకి సర్వ సపర్యలూ చేసేది. దేవుడు కల్పించిన ఈ

ఊహాతీత బాంధవ్యానికి తాత తనలో తను ఆశ్చర్య చకితుడై పోయి నవ్వుకొనేవాడు ఆ తలపులు తన హృదయ వీధులలో పరుగెత్తినప్పుడల్లా. ఈ పరిస్థితిని గుర్తించినప్పుడల్లా గౌరి తాతని ఏదో ప్రశ్నించేది. దానితో తాతకి హృదయం ఆర్ద్రపూరిత మయిపోతూంటే పెదవులు మాత్రం ఏదో మధురమైన సమాధానం చేసేవి. కాలం అలా గడిచింది కొన్ని దినాలు.

పూజామందిరం ప్రవేశించిన తరువాత గౌరి ఎవరో తెలియని నాడు తాత కేవలం విరాగి. భౌతిక వ్యామోహాలను పూర్తిగా విసర్జించి, స్వర్లోక శాశ్వతానందాపురక్తుడైన ముముక్షువు. సుఖదుఃఖాలు, బాధలు, ఆనందం, ఆశలు సుమారుగా అతనిలో అంతరించి పోయేయి. కాని దైవేచ్ఛ వేరు. గౌరి ఆటపాటలతో, ఆనందంతో కూడిన భౌతిక వాతావరణం నిర్మలంగా, గంభీరంగా ఉన్న తాత హృదయాన్ని ఒక్కసారి కల్లోలం గావించింది. ఈ అనుభూతి, మానవుడు ఊహించలేని బాధతో గాయపడి, అప్పుడే మానిపోతూన్న ఆయన హృదయ వ్రణాన్ని పదునైన కత్తితో కెక్కలించి, దుర్భరం గావించింది. బలవంతంగా తనలో ప్రవేశించిన ఈ అనుభవాలకు తాత జోహారు చేసేడు అంతకన్న చేసేదేం లేక.

విస్మృతి పధాన కరిగి, హరించిపోయిన తన పూర్వచరిత్రలో సుఖదుఃఖాలు రెండూ అనుభవించేడు తాత. కాని నాటి సౌఖ్యంలో ఎంత ఆనందంఉండేదో, దుఃఖంలో ఎంతబాధఉండేదో ఆయన యిప్పుడు చెప్పలేడు. ప్రస్తుతం మాత్రం భౌతికమైన వెర్రి ఆనందంలో పడిపోయేడు అచేతనంగా. అయితే యిది తన పారమార్థిక వ్యాపారానికీ ఏవిధానా ఆటంకం కలిగించలేదు. తననిశ్చలత్వానికి ఏమాత్రం అంతరాయం కలిగించలేదు. నాటి తన దైనికజీవితానికి సంబంధించినంత వరకు.

ఒకవంక ఆటలు, పాటలు, ఆనందం, లౌకిక సంబంధమైన వినోద కాలక్షేపాలు, యిరుగు పొరుగుల తనతోడి బాలికలతో ఆటవిడుపు సమయంలో బాల్యక్రీడలు గావిస్తూ, ఒకవంక తాతకి పూజకు కావలసిన పరికరాలుసమకూరుస్తూ, యితర దైవందిన గృహకృత్యాలు నెరవేర్చుకుంటూ, అమాయకతతో జీవితాన్ని గడుపుతూన్న వెర్రిబాగులపిల్ల గౌరినిచూసినప్పుడల్లా తాత ఏదో అవ్యక్తమైన బాధపడుతూనే ఉండేవాడు. అనుభవజ్ఞుడు, జ్ఞాని అయిన తాత యిందుకు గల కారణాలగురించి తలపోసి చట్రాయిలా ఊరుకున్నా, పిచ్చిపిల్ల గౌరిమాత్రం అప్పుడప్పుడు ఏమో ప్రశ్నలువేసి తాతని తల్లడిల్లజేస్తూండేది. ఏమైనా అతనికి దినచర్య చాలవరకూ ఆనందదాయకంగానే ఉండేది. ఆ మాదిరిగానే పరిశేష జీవితాన్ని గడిచేటట్టు అనుగ్రహించమని తన ఆరాధ్యదైవాన్ని నిత్యం కోరుకొనేవాడు తాత.

వాడుకప్రకారం ఆరోజున గౌరి తెల్లవారక పూర్వమే సమీపాన్నే ఉన్న ఉద్యానవనానికి పోయింది పూజపుష్పాలకోసం. తను వెళ్ళేటప్పుడు తాత యింకా నిద్రలోనే ఉన్నాడు. కావలసిన పూజాపుష్పాలు కోసుకొని తిరిగివచ్చి, దేవతార్చన పరికరాలన్నీ సమకూర్చి, తాతదగ్గిరకువచ్చి "తాతా!"అని పిలుస్తూ ఆయన శరీరాన్ని తాకేసరికి ఉష్ణంతో బాధపడుతూన్నట్టు గ్రహించి గౌరి చాలా ఆందోళనపడ్డది. రెండుమూర్లు పిలచిన తరువాత తాత మెల్లిగా కన్నువిప్పి, "జ్వరం వచ్చింది నా తల్లీ!" అన్నాడు మందగించిన స్వరంలో. వెంటనేపోయి తాతకు తనకు హితుడు పూజామందిరంలో ఒక భక్తుడు, భిషగ్వరుడు అయిన దీక్షితులుగారికి తెలియజేసింది గౌరి తాత పరిస్థితి. ప్రయోగించిన ఔషధం అల్లా సంజీవి ప్రాయంగా పరిణమింపజేసే అద్భుత శక్తిగల దీక్షితులుగారి వైద్యం, అసమానమైన గౌరి సపర్య ఉన్నప్పటికీ, నాలుగైదు రోజులయేసరికి తాత చాలా ప్రమాదకరమైన స్థితిలోకివచ్చేడు. తాత పరిస్థితి తెలుసుకున్నగౌరి వలవల ఏడ్చిఏడ్చి, తాతని కాపాడవలసినదని తన దైవాన్ని ప్రార్థించింది. రెండురోజులపాటు జీవన్మరణావస్థలలో కొట్టుకున్న తాతచివరకి తనను కనిపెట్టుకొని ఉన్న రెండు జీవాల సహృదయాభీష్ట సాఫల్యంవల్ల భౌతిక ప్రపంచానికి దక్కేడు. గౌరి, దీక్షితులుగారు పరమానంద భరితులైపోయారు తాతగారు మళ్ళీ జనలోకంలో పడినందుకు. కాని తాత మాత్రం ఎంతో బాధపడ్డాడు తనలో కలిగిన ఒకానొక వికృతానుభవంవల్ల. ఆ బాధోపశమనం కోసం గౌరిని దగ్గరగాతీసుకొని, కౌగలించు

కొనేసరికి అతని హృదయం ద్రవించి రోదించింది.

మొత్తంమీద ఒకపక్షం గడిచేసరికి తాతకి ఆరోగ్యం బాగా చేకూరి, తన దైనందిన కార్యనిర్వహణ యథావిధిగా గావించుకొనే శక్తి లభించింది. ఆరోజు ఒకమహత్తర పుణ్యదినం. తాత ఉషఃకాలాన్నే లేచి కాలకృత్యాలు ముగించుకున్నాడు. గౌరి యింకా నిద్రలోనే ఉంది. అమాయకమైన ఆ చిన్నారి ముఖాన్ని నిద్రావస్థలో ఉండగా చూసి, తాత ఒకచిరునవ్వు నవ్వుకొని పూజాపుష్పాలకోసం వెళ్ళిపోయేడు. పుష్పములు తెచ్చుకొని, అలసి నిద్రించిన గౌరి విశ్రాంతికి అంతరాయం కలిగించడానికి పోతున్న తనను తన హృదయం ఆటంకపెట్టింది. సర్వం తెలిసిన తాత పాపం! పిచ్చివాడివలె హృదయభారంతో నిష్క్రమించి, స్నానాదులు ముగించుకొని, పూజాగృహంలో దైవతార్చనానిమగ్నుడయేడు. పూజ సమాప్తి అయింది. తదనంతర ప్రార్థనార్థం వాడుక ప్రకారం గౌరీ! అని పిలిచేడు తాత. జవాబు లేదు. త్వరగాపోయి గౌరిని సమీపించి ఒకటి రెండుసార్లు పిలిచి, దేహాన్ని స్పృశించేసరికి జ్వరంతో కాలుతున్నది. తాతకి గుండెలో కొండ పడ్డట్టయింది. కాని వయస్సు బలంమీద కొంచెం ధైర్యం వహించేడు. మరుక్షణం నుండి దీక్షితులుగారు వైద్యం చేస్తున్నారు. తను సర్వసపర్యలు చేస్తున్నాడు గౌరికి. వారం రోజులు గడిచేయి. జాడ్యం విపరీతమైన తరహాలుగా పరిణమించడం ప్రారంభించింది. రోజురోజుకి తనలో ఒకవిధమైన నిస్పృహను అనుభవిస్తూన్న దీక్షితులుగారి వైఖరి కనిపెట్టిన తాతకి నిజంగా మతిపోయింది. రోగ తీవ్రతచేత అదివరకు సుమారు వారంరోజుల నుంచీ బాధపడుతూన్న గౌరి ఆ రోజునుంచి చైతన్యహీనంగా, బాధపడకుండా అలాపడుకునే ఉండేది. తాత మరీ ఆందోళన పడిపోయేవాడు. తాతతోకూడా దీక్షితులుగారు అహర్నిశలు అక్కడే కూర్చొని, మృత్యుముఖం ప్రవేశిస్తూన్న వేలకొద్ది రోగుల్ని జీవిత ప్రపంచానికి మరలించిన తన వైద్యప్రభావాన్ని చెప్పలేని బాధతో ఆశతో సంపూర్ణంగా వినియోగించి గౌరిని ప్రాణాపాయ స్థితినుంచి మరలించడానికి ఎంతో ప్రయత్నం గావించేడు. కాని రోజురోజుకీ తన ధైర్యస్థైర్యాలు కుంగిపోతూండేవి గౌరి పరిస్థితికి. అయినా ధైర్యం చిక్కబట్టుకుంటూ, తాతకి ఎన్నివిధాలుగానో ధైర్యం చెప్పేవాడు. కాని వృద్ధుడు, అనుభవజ్ఞుడు అయిన తాతని మభ్యపెట్టలేక పోయేవాడు ఒక్కొక్క సమయంలో గౌరి పరిస్థితి బహు ప్రమాదకరమైన మార్గాలను పట్టినప్పుడు.

పదిరోజులు పైగా గడిచాయి. దీక్షితులుగారికి ఏవిధాన చూసినా గౌరి పరిస్థితిలో ఆశ అన్నది కలగడానికి అవకాశం లేకపోయింది. ఆ రోజువరకూ ఆయన తాతతో గౌరి దేహస్థితిని గురించి సుమారుగానే చెబుతూ వచ్చేవాడు. కాని ఆవేళ మాత్రం ఏమైనా సరే తప్పనిసరిగా తాతతో గౌరి బహు ప్రమాదమైన స్థితిలో ఉన్నట్టు వివరించేడు. తాత పాపం! వలవల ఏడ్చేడు చిన్నపిల్లడిలా ఎందుకో! అదే ప్రశ్న వేసింది తన మనస్సు తన హృదయాన్ని.

పది సంవత్సరాలకు పూర్వం తన చరిత్రలోని ఆఖరిపుటలు రెపరెప వెనక్కి తిరిగిపోయేయి. రెప్పపాటు కాలంలో అదృశ్యమైపోయిన తన ఆత్మీయులు, తానా జీవిత ప్రపంచనుంచి బలవంతంగా కాందిశీకుడు కావలసిన దారుణమైన పరిస్థితిలో తను అనుభవించిన బాధ స్వప్న గతవృత్తాంతంలా నుర్చిపోగలిగేడు తాత. కాని గౌరి దేహస్థితి భయంకరంగా ఉన్న ఆ రోజున ఒక్కొక్క ఘడియ గడుస్తూన్న కొద్దీ తాత అనిర్వచనీయమైన ఆ వేదన అనుభవిస్తూండేవాడు. రాత్రి సగంపైగా గడిచింది. గౌరిని పరీక్షచేసిన దీక్షితులుగారు తాతవేసిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్పలేక కొండంత నిట్టూర్పు విడిచేడు. దానితో తాత హృదయం గజగజలాడింది. గౌరి మంచందగ్గరే కూర్చొని, శిరస్సు నిమురుతూ తాత గౌరిని ఎన్నోసార్లు పిలిచేడు. జవాబు లేదు. స్పృహతప్పి జీవన్మరణావస్థల నడుమ కొట్టుకొంటూన్న తన గౌరికోసం తాత ఎంతో విలపించేడు. ఆయన హృదయంలో ఏవో కల్లోలాలు బయల్దేరాయి. కొద్దిదినాలకు పూర్వం పరిసమాప్తి కావలసిన తన జీవితం ఎందుకు యింకా నిల్చిఉందా అని తాత తనలో తను వాపోయేడు. “పిచ్చివాడా ఎవరికోసం ఎందుకంత కఠినంగా బాధ పడుతున్నావు”అని తన మనస్సు ప్రశ్నించింది. అచేతనంగా అంజలి ఘటించి పర

మేశ్వరుణ్ణి ప్రార్థించేడు. చిన్నతనంలో, తను విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు చదువుతున్న విషయాలేవేవో తలపులోకి వచ్చేయి. చరిత్రలో గడచిన కాలంలో ఎప్పుడో మృత్యుముఖం ప్రవేశించడానికి సిద్ధంగాఉన్న యవ్వన వంతుడు, భావి భాగ్యోదయ ప్రతిభా విశేషానుభవదక్షుడు ఐన తన సుతుని ఆపదనుండి కాపాడి, కాలంచెల్లిన తనను గైకొమ్మనికోరిన ఒకతండ్రి ప్రార్థన అంగీకరించినదైవాన్ని, తత్సమానమైన తన ప్రార్థన కూడా అనుగ్రహించమని హృదయ పూర్వకంగా వేడుకున్నాడు. బంధుత్వం, అనురాగం, దయ, విశ్వప్రేమ, మానవత్వాల కంటె అతిలోక ప్రభావంగల ఒక అనిర్వచనీయమైన అనుబంధంతో, ఆశతో దైవానుగ్రం కోసం నిరీక్షిస్తూన్న తన హృదయాన్ని "గౌరినా"? అని ప్రశ్నించింది ఒక బాహ్యచైతన్యం. జనలోకాభిప్రాయ ప్రకారం గౌరి తన కేంకావాలి? గౌరికి తనకు కల బాంధవ్యం మానవ హృదయానికి ఊహాతీతమైనది. పునరుత్పత్తి మరణ కార్య నిర్వహణానికి కట్టుబడే మానవుడికి బంధుత్వాలు, ప్రేమ, ఋణానుబంధాలు, అభిమానాలు జన్మ జన్మాలకువ్యాపించి ఎప్పుడూమానవుల్ని ఆశపెట్టి, బాధపెట్టి అదృశ్య మవుతూంటాయి అని ఘోషిస్తూ, రోదించింది తన హృదయం.

రాత్రి చాలాభాగం గడిచి పోయింది. చంద్రాస్తమాన సమయం సమీపించింది. అంత వరకూ అచేతనంగా ఉన్న గౌరి కదిలి, దైన్యం విరజిమ్ముతూ తాతవంక కన్ను విప్పిచూసి, ఆ నిర్భాగ్యుణ్ణి చెప్పలేని బాధ పెట్టింది. తాత దుఃఖరుద్ధకంఠంతో "నా చిట్టిగౌరీ!" అని మాత్రం అనగలిగేడు గుండెలోని బాధను బహిర్గతం కావిస్తూ. దీక్షితులుగారు గౌరిని పరీక్షించి, తాతవంక శూన్యంగా చూసి తల దించుకున్నారు. అని మిషత్వం వహించి బాధతో గౌరి కళ్లలోకి చూసిన తాత హృదయం దుఃఖవాహినిగా పొంగి పొర్లిపోయింది. మరుక్షణంలో గౌరి దృష్టి తాత హృదయాన్ని దూసుకొని అదృశ్యమై పోయింది.

మధురమంజులభక్తి గీతాలాపనతో నిత్యం నినదించిన తాత పూజామందిరం నిరవరోధంగా విషాద గీతా లాలపించింది. తాతకి జగత్తంతా అంధకారమైపోయింది. ఏ జన్మ జన్మాలనాటి ఋణస్యనో తీర్చుకొని నిష్క్రమించిన గౌరి కోసం బరువెక్కిన తాత హృదయం, సత్యప్రేమ లోకంలో నిల్చినంత కాలంఘోషిచిం రోదించింది.

# రాష్ట్రరథం

దోగిపర్తి వెంకటరమణ

ఏదిరా! ఆంధ్రుడా! నీ మహాదిగంత
యత్న దీక్షారసస్ఫూర్తి! రత్నకంక
ణ కరధారణావేశ యజ్ఞజ్వాలన్మ
హాగ్ని హేతికోపాటోప నగ్నమూర్తి!
యుష్మదీయ చండప్రచండోగ్ర సంజ్వ
లత్తరణి కిరణాలు, చల్లారిపోయి,
నేడిదేమిరా! చలవ వెన్నెలను నోక
దవు? రవిమహోదయముగాద? తమసుపోద?
రాష్ట్రమేరాద? నీదు తరమ్ముగాద?
నీ చిరతర గాఢాకాంక్ష నీచవిధికి
విడిచి చేలవైపోతివా? విశ్వజనులు
నిన్నరసి నవ్వుచున్నారు! మిన్నుమన్ను
నీకు నీవె సంకుచితుడవై కృశించి,
దుర్నిరాశా దవానలాకీర్ణవైతి—
వెఱ్ఱిగా నిరాశావాదివిగ మరేవొ
వక్రభూషణ వర్తివై వద్దనెదవు!
నీదు రాష్ట్రమహారథ నిఖిలశక్తి
కదల బలిగోరుచున్నదే గాని కదకు
బయలుదేరకపోదు! ప్రాబల్యవేగ
వేశ హృదయ మహోద్రేక విజయనిధిగ!